క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌పై దాడి తగదు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణ మున్సిపల్ కమిషనర్‌పై దాడి చేయడం తగదని, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఏఐటీయూసీ మాజీ సీనియర్ నాయకుడు షన్ముఖరావు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపాలిటీ సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలతో పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

ముగ్గుల పోటీలు



బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ న్యామతుల్లా

చాగలమర్రి: మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక శ్రీచైతన్య భారతీ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 30 మందికి పైగా తల్లులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఎంఈఓ న్యామతుల్లా, డైరెక్టర్ చంద్రమౌళి, హెచ్‌ఎం ఎండీ రఫీ, ఏఓ శారద, ప్రిన్సిపాల్ చంద్రకళ బహుమతులు అందజేశారు.

దళితుల భూములను కాపాడండి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: దళితుల భూములు కబ్జాకాకుండా కాపాడేలా చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామోజీ ఇమ్మానియేల్ కోరారు. రాష్ట్ర మాలమహానాడు రామోజీ వర్గం సభ్యులతో బుధవారం పట్టణంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. అనంతర ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీగా వచ్చి నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈనెల 22న విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ , ప్రధాన కార్యదర్శి సాగర్ విజయ్‌కుమార్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు పెన్నెం సుధాకర్, సమన్వయకర్త ఓబులేసు, సంయుక్త కార్యదర్శి కిరణ్‌కుమార్‌, రాయలసీమ మహిళా అధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



రుద్రవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

రుద్రవరం: మండలంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. చివరిరోజు మండల కేంద్రంలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండలంలో 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారం కోసం మొత్తం 155 దరఖాస్తులు అందాయని, వాటిలో 35 వరకు పరిష్కరించినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు.

సివిల్స్‌పై అవగాహన

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సివిల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. నారాయణ ఐఏఎస్ అకాడమీ నుంచి శ్రీనాథ్, అనంతకృష్ణసాయి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్ విభాగంలోనే గాకుండా సివిల్స్ పై దృష్టి సారించవచ్చని సూచించారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

గడివేముల: జిందాల్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విజేత, గడివేముల జెడ్పీ హైస్కూల్ రన్నరప్‌గా నిలిచాయి. బాలికల విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ విన్నర్, గని జెడ్పీ హైస్కూల్ రన్నరప్‌గా నిలిచాయి అండర్ -14 కబడ్డీ బాలుర విభాగంలో గడివేముల జెడ్పీ హైస్కూల్ విజేత, సెయింట్‌పాల్ స్కూల్ రన్నరప్, బాలికల విభాగంలో సెయింట్ పాల్ స్కూల్ విన్నర్, గడివేముల జెడ్పీ స్కూల్ రన్నరప్‌గా నిలిచాయి. ఆయా క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, హెచ్‌ఎం విక్టర్ ఇమ్మాన్యుయల్, జిందాల్ ప్రతినిధులు విజయలక్ష్మి, భాస్కర్ అందజేశారు.

రాయలు నిర్మించిన ఆలయం!

- మద్దూరులో ఉత్తర ద్వార ముఖంతో నిర్మించిన శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరాలయం
- 450 ఏళ్ల క్రితం ఏర్పాటు
- వైకుంఠ ఏకాదశిన వేలాదిగా తరలిరానున్న భక్తులు



మద్దూరులో ఉత్తర ముఖద్వారంతో నిర్మించబడిన లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరాలయం



శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి మూల విరాట్

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామంలో 450 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణ దేవరాయల కాలంలో ఉత్తరముఖ ద్వారంతో శ్రీలక్ష్మీప్రసన్న వేంకటేశ్వరాలయాన్ని నిర్మించారు. శ్రీకృష్ణ దేవరాయలు నల్లమల అడవి గుండా శ్రీశైలం నుంచి అహోబిలం వచ్చి అక్కడి నుంచి వేంకటేశ్వర స్వామి దర్శనానికి తిరుమల వెళ్తూ మార్గమధ్యంలోని మద్దూరు గ్రామంలో విడిది చేశారు. రాయల వారు నిత్యం నిద్ర లేచిన వెంటనే వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం అలవాటు. అయితే అడవిలో ఆలయం లేకపోవడంతో స్వామి వారి దర్శనం చేసుకోవడం ఎలా అని ఆలోచించి తెల్లవారే లోగా ఆయన బస చేసిన ఇంటికి ఎదురుగానే ఉత్తర ముఖంగా ఆలయాన్ని నిర్మించినట్లు స్థానికంగా లభించిన చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. అయితే ఆలయంలో స్వామి వారి మూలమూర్తి తిరుమలలోని వేంకటేశ్వరుడిని పోలి ఉంటుంది. అక్కడి ఆలయంలో జరిగినట్లుగానే పూజా కైంకర్యాలన్నీ ఇక్కడా నిర్వహిస్తుండటం విశేషం. ఏటా వైకుంఠ ఏకాదశి నాడు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఆ రోజు శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. అలాగే ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా చేపడతారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన స్వామి వారి దర్శనం కోసం సుదూర, సమీపంలోని ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వస్తారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ రాజకీయ కార్యకలాపాలను ప్రారంభించడానికి ముందు స్వామి వారిని దర్శించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే విజయం సాధించిన తరువాత మరోసారి స్వామి వారి సన్నిధిలో పూజలు చేయడం ఆచారంగా సాగుతోంది. అక్కడ ఆలయ కోటగా నిర్మించిన ఇంటి చుట్టూ గ్రామస్తులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఉత్తర ముఖద్వారంలో దర్శనానికి ఏర్పాట్లు



మద్దూరు గ్రామంలో ఉత్తర ముఖద్వారంతో వెలసిన శ్రీలక్ష్మీప్రసన్న వేంటేశ్వర స్వామిని శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు దర్శించుకోనేందుకు ఏర్పాట్లు చేశాం. ఆ రోజు విష్ణు పురాణం, హోమం, ప్రవచనాలు, ప్రసంగాలు, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం.

– మామిడి కిషోర్‌శర్మ, ఆలయ అర్చకులు, మద్దూరు

రేపు వైకుంఠ ఏకాదశి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్ రామాలయంలో ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి నిర్వహిస్తామని భగవత్ సేవా సమాజ్ అధ్యక్షుడు సూరయ్య తెలిపారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్వామి వారిని గరుడ వాహనంపై సుగంధ వేంకటేశ్వరస్వామిగా యాలకులతో అలంకరిస్తామన్నారు. తెల్లవారుజామున 5గంటల నుంచి భక్తులకు ఉచిత దర్శన ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. 13న తిరుప్పావై వ్రత పరిసమాప్తిని పురస్కరించుకొని గోదాదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం, 14న మహారథోత్సవం ఉంటుందని వివరించారు. అనంతరం కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. సభ్యులు శ్రీనివాస్, మధుసూదన్‌గుప్త, పార్థసారథికృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ టీచర్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయం నుంచి సాయిబాబానగర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న టీచర్ జయలక్ష్మిపై అదే గ్రామానికి చెందిన శివకుమార్ విచక్షణారహితంగా దాడిచేయడంతో కంటి చూపు పోయే ప్రమాదం ఉందన్నారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు బుజ్జమ్మ, సారమ్మ, వరలక్ష్మీ, రాధాకృష్ణవేణి, అనురాధ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు



మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్

దొర్నిపాడు: రైతులు తమకు ఉన్న పొలంలో సగభాగం ప్రకృతి వ్యవసాయం చేయాలని ఏడీఏ సుధార్ సూచించారు. బుధవారం మండలంలోని కొండాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వరికోతల అనంతరం ఆవాలు సాగు చేసుకోవాలని దీంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితిల్లోనూ పొలాలను బీడుగా ఉంచరాదన్నారు. ఆవాల సాగుకు పెట్టుబడి లేకుడా దిగుబడులు సాధించవచ్చన్నారు. సొసైటీల్లో సభ్యత్వం ఉన్న రైతులు వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. జేవీఓ వెంకటరమణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



యర్రగుంట్లలో వరి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

పంటల బీమా చేయించుకోండి

శిరివెళ్ల: రబీలో సాగు చేసిన పంటలకు రైతులు పంటల బీమా చేయించుకోవాలని ఏఓ సుధాకర్ తెలిపారు. బుధవారం యర్రగుంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పంట దిగుబడి తగ్గినా, అతివృష్టితో పంటలు నష్టం వాటిల్లినా బీమా ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చన్నారు. ఈనెల 15వ తేదీలోపు సొత భూమి, కౌలు రైతులు ఎకరానికి రూ.126 సమీప రైతు సేవా కేంద్రాల్లో చెల్లించాలన్నారు. పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్, పంట ధ్రువ పత్రం జిరాక్స్ కాపీలతో బీమా చేయించుకోవాలని చెప్పారు. ఏఈఓ జస్విరెడ్డి పాల్గొన్నారు.

నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని గ్రామాలకు 15 ఆర్థిక సంఘం బేసిక్, టైడ్ గ్రాంట్ నిధులు మంజూరయ్యాయని అధికారులు బుధవారం తెలిపారు. శిరివెళ్ల మేజర్ పంచాయతీకి రూ.38.39 లక్షలు, యర్రగుంట్ల రూ.14.69 లక్షలు, గోవిందపల్లెకు రూ.14.75 లక్షలు మంజూరయ్యాయి. మహదేవపురం రూ.6.37 లక్షలు, బోయలకుంట్ల రూ.6.71 లక్షలు, చెన్నూరు రూ.6.71 లక్షలు, గంగవరం రూ.4.03 లక్షలు, గుంప్రమాన్‌దిన్నె రూ.6.88 లక్షలు, గుండంపాడు రూ.3.86 లక్షలు, జీనేపల్లె రూ.2.86 లక్షలు విడుదలయ్యాయి. కామినేనిపల్లె రూ.3.23 లక్షలు, కోటపాడు రూ.5.29 లక్షలు, మోత్కలపల్లె రూ.2.48 లక్షలు, వనికినిదిన్నె రూ.2.31 లక్షలు, వీరారెడ్డిపల్లె రూ.2.43 లక్షలు, వెంకటాపురం పంచాయతీకి రూ.2.91 లక్షలు మంజూరయ్యాయని వివరించారు.

ఫిబ్రవరి 2,3 తేదీల్లో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

శిరివెళ్ల: ఫిబ్రవరి 2,3 తేదీలలో మండలంలోని వంద శాతం వికలత్వం గల పింఛన్ల పరిశీలన జరుగుతుందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. పూర్తిగా మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన వారు మండలంలో 56 మంది వికలాంగులున్నారన్నారు. వీరికి ప్రభుత్వం నెల నెలా రూ.15 వేల పింఛన్ పంపిణీ అందజేస్తుని చెప్పారు. గోవిందపల్లెలో 14, యర్రగుంట్ల 10, శిరివెళ్ల 9 మంది ఉన్నారన్నారు. బోయలకుంట్ల 3,చెన్నూరు 4, గుంప్రమాన్‌దిన్నె, గుండంపాడులలో 5 చొప్పున ఉన్నారన్నారు. కోటపాడు 5, మహదేవపురంలో ఇద్దరు పింఛన్ తీసుకుంటున్నారన్నారు. డీఆర్‌డీఏ నియమించిన మెడికల్ డాక్టర్లు పరిశీలిస్తారని చెప్పారు. వికలాంగుల పింఛన్లలో అనర్హులను మూడు దశల్లో పరిశీలిస్తారన్నారు. మొదటి దశలో రూ.15 వేలు పింఛన్లు తీసుకుంటున్న వారు, రెండో దశలో రూ.10 వేలు, మూడో దశల్లో రూ.6 వేల పింఛన్లు తీసుకుంటున్న వారిని పరిశీలిస్తామని వెల్లడించారు.

రోడ్డుకు అడ్డం



భారీ వాహనాలను రోడ్డుపై నిలిపి పంక్చర్లు వేసుకుంటున్న దృశ్యం

గడివేముల–నంద్యాల రహదారిలో పంక్చర్ దుకాణాల వద్ద భారీ వాహనాలకు పంక్చర్ వేసుకునేందుకు రోడ్డుపైనే నిలుపుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా గ్రంధివేముల గ్రామం వద్ద వాహనాలను రోడ్డుపైనే ఉంచడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో రోడ్డు పక్కనే పంక్చర్ దుకాణాలు ఉన్నాయి. సమీపంలోనే జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. గతంలో ఈ మార్గంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని భారీ వాహనాలను రోడ్డుపై నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

– గడివేముల

సంక్షిప్తం

వ్యవసాయంలో నైపుణ్యం పెంచుకోవాలి

బనగానపల్లె: వ్యవసాయంలో నైపుణ్యాలను పెంచుకుని పెట్టుబడులు తగ్గించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన నార్మ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో హరిజన ఉపప్రణాళికలో భాగంగా నార్మ్ ఆధ్వర్యంలో మేలైన యాజమాన్య చర్యలపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సహకారంతో రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు. చీని, నిమ్మ తోటల్లో రైతులు ఎదుర్కొంటున్న వేరుకుళ్లు, పోషకలోపాల నివారణపై శాస్త్రీయ పద్ధతులను అవలంభించి పరిష్కరించుకోవాలని సూచించారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ రమణయ్య మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడి అధిక దిగుబడుల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు బాలరాజు, ఆదినారాయణ, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపులోని కర్నూలు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ బీకాం విద్యార్థి షేక్షావలి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 4వ తేదీ పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 8 కిలోమీటర్ల రన్నింగ్ విభాగంలో రెండవ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన ఈ విద్యార్థి ఈ నెల 12వ తేదీన ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆర్మీ గోల్ఫ్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు 28వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ బీఎస్.ప్రసాద్ వెల్లడించారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని అభినందించారు.

వీరనారాయణుడి దర్శనం.. సర్వపాపహరణం



వీరనారాయణస్వామి మూలవిరాట్, ఆలయ గాలిగోపురం

పాణ్యం: ధనుర్మాసంలో పాణ్యంలో వెలసిన శ్రీ వీరనారాయణ స్వామిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగుతాయి. ఈ మాసంలో రోజూ తెల్లవారుజాము నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక పూజలు, అలంకారాలను భక్తులు దర్శించుకుంటే చాలు పుణ్యఫలం కలుగుతుంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయంలో గత నెల 16వ తేదీ నుంచి ధనుర్మాసం సందర్భంగా ప్రతి రోజూ విశేష పూజలు జరుగుతున్నాయి. భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటుంటారు.

పూర్వ కథ: పాణ్యంలో వెలసిన వీరనారాయణస్వామి మూలమూర్తి అష్ట బహూ ద్విపాదములను కలిగిఉంది. ప్రయోగ సుదర్శన చక్రం, ఖడ్గం, గద, శంఖం, విల్లు, ముసలము, కటిహస్తం, అభయహస్తంతో వెలిశారు. సంస్కృత భాగవతంలో కాలనేమి అనే రాక్షస సంహారార్థమై ఉద్భవించిన మూర్తి శ్రీ వీరనారాయణస్వామి వారు. శ్రీవారి ఆలయాన్ని క్రీ.శ 7వ శతాబ్దంలో పశ్చిమ చాళుక్యులు సందర్శించినట్లు చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ 1321వ సంవత్సరంలో కాకతీయ రాజైన ప్రతాప రుద్ర మహారాజు శ్రీవారిని దర్శించి ఆలయ జీర్ణోద్ధరణ గావించి అభివృద్ధి చేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ 16వ శతాబ్దంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారు దర్శించి, సేవించి స్వయాన వారు రచించిన కాలజ్ఞానంలో దశమ శ్వాసములో వీరనారాయణస్వామి స్వయాన మమ్ము ధ్యానము చేయమని చెప్పారని రాసుకున్నారు. వారికి నలుగురు సంతానం తర్వాత ఒక కుమార్తె. ఆమెకు వీరనారాయణమ్మ అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఆ వీరనారాయణ సంతతి వారే నేడు బ్రహ్మంగారి మఠాధిపతులుగా ఉన్నారు.

ఆలయానికి తూర్పు దిక్కున భృగుమహర్షి ప్రతిష్టించిన బృంగీశ్వరాలయం, దక్షిణాన రుద్రాంశ సంభూతుడైన ఆంజనేయస్వామి ఆలయం, పశ్చిమాన భైరవాలయం, ఉత్తరాన పాణికేశ్వర స్వామి ఆలయం, అగస్త్యునిచే ప్రతిష్టితమైన ఆగస్త్యేశ్వరాలయం ఉన్నాయి.

ప్రత్యేక పూజలు :ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, గోధూళి, స్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహిస్తారు. అలాగే అంగరంగా వైభవంగా రథోత్సవం జరుగుతుంది. అంతేకాక ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు, ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వారా దర్శనం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాధిగా తరలివచ్చి ధనుర్మాసంలో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకొని పునీతులవుతారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్‌దీపాలు, మామిడి తోరణాలు, అరటి బొదెలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

ధనుర్మాసం పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా ఆలయానికి తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి వారికి విశిష్ట పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తాం.

– ఈఓ. సువర్ణ

శిలాశాసనం కాదు!

- ఏళ్లుగా మార్చని సమాచార బోర్డులు
- నేటికీ కొనసాగుతున్న తొలుత ఏర్పాటు చేసిన పేర్లు



చాకరాజువేముల సచివాలయంలో పాతపేర్లతో బోర్డు

దొర్నిపాడు: వారు రాజులు కాదు.. చరిత్ర సృష్టించిన వారు అంతకంటే కాదు.. అయినా వారి పేర్లు ఏళ్లకేళ్లుగా గోడలపై దర్శనమిస్తున్నాయి. ఏంటీ గందరగోళం అనుకుంటున్నారా.. విషయంలోకే వస్తున్నాం.. ప్రభుత్వ కార్యకలాపాల వివరాలు ప్రజలకు తెలియజేయాలని సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారు. ఇందులో భాగంగా ఆయా కార్యాలయాల్లో సమాచారం కోసం సంప్రదించాల్సిన అధికారి, అమలు కాకపోతే ఫిర్యాదు చేయాల్సిన అధికారి పేరు, ఫోన్ నంబర్‌తో వివరాలు ప్రదర్శిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే కొన్నేళ్లుగా అధికారులు మారుతున్నా మొదట్లో రాసిన పేర్లు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఎటూ ఈ చట్టం అమలు కావడం లేదనేది బహిరంగమే. చట్టమే పనిచేయనప్పుడు అధికారుల పేర్లు ఎందుకు మార్చాలని భావించారేమో.. ఎందరు మారినా గోడలపై మాత్రం వివరాల్లో మార్పు ఉండటం లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీల కార్యదర్శులను కూడా పూర్తిగా మార్చారు. అయినా బోర్డుల్లో మాత్రం పేర్లు మార్చకపోవడంతో సమచారం అందనప్పుడు ఎవరిని సంప్రదించాలో తెలియక పలువురు తికమక పడుతున్నారు. ప్రస్తుతం ఎంపీడీఓగా సావిత్రి, ఈఓపీఆర్డీ సులోచన విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఎక్కడ చూసినా పాత పేర్లతో శిలాశాసనాల్లా బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లను పేర్కొనాలని కోరుతున్నారు.



రైతు నేస్తాల సందడి

పొలంలో గుంపులుగా చేరిన కొంగలు

పంట పొలాల్లో శ్వేత వర్ణం పక్షులు సందడి చేస్తున్నాయి. రైతులు పొలాలను దున్ని రబీ సీజన్ సాగుకు సిద్ధం చేసుకుంటున్న సమయంలో తెల్లటి కొంగలు గుంపులు గుంపులుగా చేరి అహారం కోసం అన్వేషిస్తున్నాయి. పొలంలోని పురుగులను తినేస్తూ వాటి ఆకలిని తీర్చుకుంటూ రైతులకు నేస్తాలుగా మారాయి. బుధవారం గడివేముల మండలంలోని కరిమద్దెల గ్రామం సమీపంలో కొంగలు గుంపులుగుంపులుగా చేరి చూపరులను కనువిందు చేశాయి.

– గడివేముల

పింఛన్ల తనిఖీ ప్రారంభం



చాగలమర్రిలో వికలాంగులను పరిశీలిస్తున్న వైద్యులు

చాగలమర్రి: మండలంలోని సాంఘిక సంక్షేమ పెన్షన్లలో భాగమైన (బెడ్రిడన్) అంటే దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతూ, మంచానికే పరిమితమైన వ్యక్తులకు సంబంధించిన 18 మందిని బుధవారం స్థానిక ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులు గల వైద్య బృందం తనిఖీ నిర్వహించింది. వారికి గత ప్రభుత్వం వైద్య సహాయం కోసం ప్రతి నెల రూ.15,000 పెన్షన్‌గా అందజేసింది. కూటమి ప్రభుత్వం ఆ పెన్షన్లు పొందుతున్న వ్యక్తులు అర్హులా? కాదా? అని వారి ప్రస్తుత స్థితి, వైద్యులు మంజూరు చేసిన వికలత్వ ధ్రువపత్రాలను ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి తనిఖీ చేయిస్తున్నారు. మండలంలో బెడ్రిడన్ పెన్షన్‌దారులు సుమారు 18 ఉన్నారు. వారిలో 8 మంది మండల కేంద్రంలో ఉండగా, మిగతా 10 మంది ఆయా గ్రామాల్లో ఉన్నట్లు ఎంపీడీఓ తెలిపారు. తనిఖీలో ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ మోహన్‌నాయక్, జనర్ మెడిసిన్ వైద్యనిపుణులు రాజశేఖర్ స్వరూప్, రాజశేఖర్‌రెడ్డి, వైద్యులు ఆదినారాయణ, వీరితో పాటు స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.